# డబ్బు ఖర్చు రైల్వే

డబ్బు ఖర్చు రయిల్వే ధర్మమా అని అరకు వేలీలో అయిదేళ్ళు అరణ్య వాసం. అజ్ఞాత వాసం చేశాము. అక్కడ పళ్ళు తెగ తినొచ్చునీ పాలు ప్రవహిస్తాయనీ బేవార్సుగా లైఫ్ ఈజీగా గెటాన్ కావచ్చునీ, పరుగులెత్తుకు వచ్చినవాళ్ళు పూర్ మేన్స్ ఊటీలో డోస్ తిన్నారు. అయితే అరకువేలీ పేరు చెప్పగానే. చింతపండూ- చీపురు కట్టలూ. పనస పళ్లూ- పొట్టి సెట్టి. బాబూరావు కిళ్లీ కొట్టు త్రినాధు పెసరట్టు. పంతులు హోటలూ- చచ్చిపోయినతాసీల్దారు గారూ. ఎప్పుడూ కుంటుకుంటూ

తిన్నగా నడవని "కోపరేటివ్ బస్సు — ఎక్కడా ఆగని రాందాసూ. డాక్ రన్నరు మరియూ మాజీ పోలీసు కనిస్టేబు సాంబమూర్తీ పేషంట్లను పేషన్స్ లేకుండా బండబూతులు తిట్టిచండాలు పోగుచేసి శ్రీనివాసుడికి గుడి కట్టించిన పులి మీసాల పెద్ద డాట్రాయూ. స్మశానం పక్కనే వున్న ఆసుపత్రిలో డ్రామాపోర్షన్లు కంఠతాపట్టే డ్రెస్సరూ. అరివీర భయంకరుడు అజగాంకరుడు. ఆవుకన్నా సాధువైన ఆవుల రామిరెడ్డి గారూ. అరవంకంటె తెలుగు బాగా వచ్చినా అరవ పితలాట కాలు పెట్టందే ప్రాణం ఒప్పని హమేషా బ్లడ్ ప్లెషరు కృష్ణన్. ఎందరి తలల్లోనో నాలుకలా తిరిగే మీ ప్రియ శిష్యుడు మీరు చెప్పని వన్నీ స్టేజీమీద చేసి చూపించే పొట్టి పంతులూ. ఎన్నెన్నో స్మృతులు దొంతరలు దొంతరలుగా వచ్చి మనసును తట్టి లేపుతాయి.

ఆ అడివి ఊళ్ళో మీరో చిన్నసైజు హీరో. అందుకే అక్కడ వున్న నాలుగైదేళ్ళూ మీరాడింది ఆటా, పాడింది పాటా! మీ చిట్టీ చిట్టి అలకలూ పొట్టి పొట్టి కోపాలూ తీర్చలేక శతమతమై పోయేవాళు మీ గేంగు.

అన్నిట్లోనూ తల దూర్చడం—నా బొండో అని చాకిరీ చేయడం మీకు అనవాయితీ అయిపోయింది.

అనక అందరితో తగూలాడ్డం. పేచీకోరని పేరు మూట కట్టుకోవడం మీకు మామూలే!

మొదట్లో మనం రెండు టెంట్లు వేసుకుని అందులో వుండే వాళ్ళం (camp Fire) మంటలు వేసుకుని చుట్టూ కుర్చీలు వేసుకుని కబుర్లు చెప్పుకునేవాళ్ళం. ఎదురు గుండా బ్రహ్మాండమైనలోయ— ఇటూ అటూ పర్వత రాజపుత్రికలలా పరుగెత్తే సెలయేళ్ళు.... అక్కడికి పులులు నీళ్ళు త్రాగడానికి వస్తాయనేవారు నిజమేనాండి? చిరుతపులి

అడుగులు చూపించే వాళ్లు మన వెంటువెనుక— హడిలిచచ్చిపోయే దాన్ని' పప్పువుంటే ఉప్పువారికేదికాదు. ఉప్పు వుంటే పప్పుదారికేది కాదు. ఏదో ఒక వస్తువు లేకుండా గడుపుకు పోవాల్సివచ్చేది. పలకరించేందుకు ఎవరూవుండే వాళ్ళు కారు. టెంటు బయట కుర్చీవేసుకుని ఆలోయిలోకి చూస్తు గంటలకు గంటలు గడిపేసేవాన్ని. అక్కడే బల్ల వేసుకుని మీరూ నేనూ పిల్లలూ భోజనాలు చేసే వాళ్ళం. ఆ బల్లమీద కొండల కేసి చూస్తూ సెలయేళ్ళ చప్పుళ్ళు వింటూ పేకాడుకునే వాళ్ళం.

కొప్పులో ఎర్రటి మందారపూలు తురుముకొని, వీపుమీద ముడి వేసుకుని చుట్టబెట్టుకున్న జిలుగు జలతారు వెన్నెచిన్నెల రలతో సారా సేవించి, ఒకరు మంట దగ్గర డమరూ వాయిస్తూంటే లయ బద్ధంగా తాళగతి తప్పకుండా అడుగులువేస్తూ తమ మగవాళ్ళతో చేయి చేయి కలిపి సిగ్గు బిడియాలు లేకుండా చెట్టాపట్టా లేసుకుని వలయాకారంగా తిరుగుతూ "ధిమ్సా డాన్స్" చేస్తుంటే గతంలోకి ఎక్కడికో విసిరేసి నట్లనిపించేది. ఏ యుగంలో జీవిస్తున్నామో తెలిసేది కాదు నాకు.

ఆ ఆకుపచ్చ సిరా ఒలక పోసినట్లున్న అడివిలో పచ్చని మైదానాలలో. ఆ కొండల నేపథ్యంలో జలపాతాల చప్పుళ్ళు వింటూ బండలతోనూ నీళ్ళతోనూ చక్కగా పెనవేసుకు పోయిన వారి జీవితాలను చూస్తోంటే వాళ్ళను ప్రకృతి ఒడిలోనుంచి విడదీసే ప్రయత్నాలు చేసే మనగవర్నమెంటును తల్చుకుంటే పిచ్చికోపం వచ్చేది నాకు. వాళ్ళు చదువు కోవాలిట? మనకు మల్లే వాళ్లు కావాలనుకోవడం కంటె దౌర్భాగ్యం వుంటుందా? మనం వారికంటె ఎక్కువ అనుకుని వాళ్ళను బాగు

చేయాలను కోవడం అపరాధం అంటాను నేను. మన జీవితాలలో లేనిది హరించి పోయినదేదో వెతుక్కుంటే వారిలో మనకు దొరుకుతుంది.

అరకువేలీలో వున్నది గవర్నమెంటు జాతి మనుష్యులూ దుకాణాల వాళ్ళూ. ప్రకృతితో గాఢంగా పెనవేసుకుపోయిన జీవితాలు గడిపే కొండవాళ్లు. ఈ ఆదిమ నివాసుల కొండల గుండెలు పగల గొట్టి-అరణ్యాలు నరికి, చదును చేసి మీ డబ్బు ఖర్చు రైల్వేవాళ్ళ వంతెనలు సొరంగాలు. స్టేషనలూ ఇళ్ళూ కట్టి రైలు వేశారు. ఆ భీషణ ప్రకృతిని చీల్చుకుంటూ మీ ఇనుప పట్టాలు కిరండల్ దాకా వేళ్ళేయి. కాకిరాయి తెచ్చే రైళ్ళు చకచక పరుగులెత్తి సాగేయి. ఈ నవ రైల్వే నిర్మాణం వలన ఈ కొండవాళ్ళకు డబ్బు విలువ బాగా తెలిసివచ్చింది.

ఇప్పుడు వాళ్ళు ప్రకృతి ఒడిలో అమాయకంగా నిద్రించే భూమాత బిడ్డలు కారు పట్నం పోయి సినిమాలు చూస్తున్నారు. పెర్లిస్లుకాని ద్రస్సులు వేసుకొంటున్నారు. ట్రాన్సిస్టర్లు కొంటున్నారు. ఆ ఆదిమ నివాసుల సంఘ జీవితంలో డబ్బు ప్రవేశించింది — మన తాలూకు కుళ్ళుకూడా వెంటనే చేరింది. అవును — నిజమే వాళ్ళను మనంత వాళ్ళను చేసికాని మనం వదలం అని దృఢ ప్రతిజ్ఞ చేశాం కదా!

అన్నట్టు అరకులో వుండగా పెరట్లో పెద్ద కూతురిలా నిలువెత్తు పెంచిన మన గులాబిచెట్టు, ఇప్పుడు ఎవరి దొడ్లో పూలు పూస్తోందో?

గోడ మూల నక్కినట్లు పొంచి దొంగ చూపులు చూసే మందార మొక్కను ఎవరూ పీకి పారెయ్యలేదుకదా! దాని పక్కనే వేశాను చిన్న మల్లి పందిరి. ఎవరూ నీళ్ళు పోయకపోతే బెంగటిల్లి అది ఎండి పోయిందేమో....ఆఫీసు ఎదురు గుండా వేసిన యూకలిప్టస్ చెట్లు ఈ పాటికి ఎంత ఎత్తు ఎదిగి ఉంటాయి చెప్మా....రోకలి బండలా

చప్పుడు చేసుకుంటూ వచ్చే రైలు దాని పరుగులిడే చక్రాలకు అట్టడుగునించి ప్రవహించే జీవితవాహిని ఎన్నడైనా గుర్తుంటుందా?

అరకు రైల్వేస్టేషన్లో బండి ఆగి బయల్దేరే ముందు కూత వేసినప్పుడు- అది మీ కందరికీ జయ జయ ధ్వానాలు తెలుపుతోందని గ్రహించాలి।

ఆ సొరంగాల గుండా ప్రయాణం చేసే రైల్లో సుఖంగా కూర్చున్న పెద్ద మనుష్యులు వారు అలా సౌకర్యంగా ప్రయాణం చేయడం కోసం కష్టపడిన ఎన్నో వేలమంది మీ బోటివాళ్ళు ఆ రైలు ఎక్కకుండానే తల వంచుకుని సెలవంటూ తమతమ నెలవులకి వెళ్ళిపోయారని గుర్తుంచుకుంటే చాలు!

కాని తీరికూర్చుని ఎవరు సుఖమైన వేళల్లో కష్టజీవుల్ని జ్ఞాపకం చేసుకుంటారు?

చేసుకోకూడదు. దరిద్రులమీంచి కష్టజీవుల మీంచి డబ్బుఖర్చు రైల్వేవాళ్ళు రైలును నడిపించేస్తారు.

సుఖపడేవాళ్ళు. కాకాగాళ్ళు రైల్లో కూర్చుని ప్రయాణాలు చేస్తారు.

తెలివితక్కువవాళ్ళు దాని నిర్మాణంలో పని చేస్తారు. అందుకే మిమ్మల్నెవరూ చిన్న సైజు హీరో అయినా రైలెక్కండి రండి అని పిలవ లేదు. అరకువేలీ మిమ్మల్ని మర్చిపోయింది. —

సో వెరీసారీ అండీ.